
ప్రజాశక్తి
గురువారం 4 సెప్టెంబర్ 2025
5
విజయనగరం




ముగ్గురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, నెల్లిమర్ల

ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వారిలో భోగాపురం మండలం రావాడ జెడ్‌పి హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.సూర్యనారాయణ, నెల్లిమర్ల మండలం అలుగోలు జెడ్‌పి హైస్కూలు రిటైర్డు ప్రధానోపాధ్యాయులు జిఎస్ కాంతారావు, పారసాం జెడ్‌పి హైస్కూలు గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు ఎస్.త్రినాధరావు ఉన్నారు. వీరు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకోనున్నారు.


కాంతారావు


త్రినాధరావు


సూర్యనారాయణ

ఎక్సైజ్‌కు మామూళ్ల కిక్కే కిక్కు



మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ శాఖలోని కొందరు అధికారులు వంత పాడుతున్నారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు మద్యం విక్రయించినా, నిబంధనలు గాలికొదిలేసినా చోద్యం చూస్తూ మామూళ్ల మత్తులో నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. దీనికితోడు మద్యం దుకాణాల యజమానులు సిండికేట్లు గా ఏర్పడడానికి మధ్య వర్తులుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బొండపల్లి మండలంలో ఐదు మద్యం షాపులకు మొదటిలో కొంతమేర చిన్నపాటి తగాదాలు ఉన్నప్పటికీ, వాళ్లను పలుమార్లు సముదాయిస్తూ 'ఒకేతాటిపైకి (సిండికేట్) తీసుకువచ్చేందుకు కొందరు ఎక్సైజ్ అధికారులు ప్రయత్నించారని ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు మద్యం షాపుల నుంచి నెలవారీ మమ్ముూళ్ల వసూలు సరాసరి. ప్రభుత్వం ఇచ్చే లక్ష్యం కోసం తనిఖీలు చేయకుండానే సిండికేట్ల ద్వారా కేసులు నమోదు చేస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారుల తీరుచూసి జనం విస్తుపోతున్నారు.

- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- ఊరూరా బెల్టుషాపులు
- వేలం పాటలకు అధికారుల సహకారం
- నెలవారీ వసూళ్లు
- తనిఖీలు చేయకుండానే కేసులు

ప్రజాశక్తి - బొండపల్లి

గజపతినగరం సర్కిల్ పరిధిలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మొదటిలో కూటమి ప్రభుత్వం 180 ఎంఎల్ బాటిల్‌పై ఇచ్చే మార్జిన్ 9.5శాతం సరిపోవట్లేదని మద్యం వ్యాపారులు గగ్గోలు పెట్టడంతో కొన్ని నెలలు క్రితమే 14.5శాతం వరకు ప్రభుత్వం పెంచింది. అయినా నష్టాలు వెంటాడుతున్నాయనే సాకుతో గ్రామాల్లో విచ్చలవిడిగా అధిక రేట్లకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. మరికొన్ని గ్రామాలలో సిండికేట్ల మధ్యవర్తులుగా ఉండి ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకొని వెళ్లి బెల్ట్ దుకాణాలు నిర్వహించేందుకు బేరసారాలు కుదుర్చు కుంటున్నారు. మండలంలో కనిమెరక గ్రామంలో ఇద్దరు వ్యక్తులు రూ.2.40లక్షలకు, గిట్టుబిల్లిలో రూ.1.30లక్షలకు వేలంపాటలు దక్కించుకున్నారు. అంబటి వలస గ్రామం నుంచి సుమారు పదిమంది బెల్ట్ షాపులు నిర్వహించగా ఎక్సైజ్ అధికారులకు ఏడాదికి ఒక్కో బెల్ట్ దుకాణం నుంచి రూ.15వేలు నుండి రూ.20 వేల వరకు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఒక్క అంబటి వలస గ్రామంలోనే ఎక్సైజ్ అధికారులకు మూడు లక్షల వరకు వసూళ్ళు అయినట్లు సమాచారం. కంచెరెడ్డిపాలెం, బి.రాజేరు గ్రామంలో 5 బెల్ట్ షాపులు నిర్వహణ కోసం ఒక్కో షాపు నుంచి రూ.3వేలు ప్రతినెలా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొండపల్లి మండల కేంద్రంలోనూ ఇదే బాటలో పదుల సంఖ్యలో కిరాణా షాపులు , ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో ద్వారా మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నప్పటికీ ఎటువంటి తనిఖీలు, చర్యలు లేకపోవడం పట్ల ఎక్సైజ్‌శాఖ అధికారులపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ముద్దూరు, నెలివాడ, గరుడబిల్లి, గొట్లాం, దేవుపల్లి, రయింద్రం తదితర గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. దీని వెనుక వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.

మద్యం దుకాణాల రోజూ ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించాలి. కొన్నిసార్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. కొందరు అనధికారికంగా అమ్మకాలు చేస్తున్నా, రోడ్ల పక్కనే తాగుతున్నా పట్టించుకోవడం లేదు.. అక్రమ అమ్మకాలను, బెల్టుషాపులను నిరోధించాల్సిన అధికారులే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపులపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే గుట్టుగా ఉంచాల్సిన అధికారులే మద్యం వ్యాపారాలకు వారి సమాచారం ఇచ్చి ఇబ్బందులకు గురి చేసే విధంగా సహకరిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ప్రభుత్వం ఇచ్చే లక్ష్యం కోసం అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తున్నట్లు తనిఖీలు నిర్వహించకుండానే సిండికేట్లు ద్వారా ఎవరో ఒకరు బెల్టుషాపు నిర్వాహకుడిని బాటిళ పట్టుకొని స్టేషన్‌కు పిలిపించి తూతూ మంత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఆ నిందితుడికి అయిన ఖర్చంతా సిండికేట్లు భరించేలా ఎక్సైజ్ అధికారులే ఏర్పాట్లు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే గ్రామాల్లో బెల్టుషాపుల్లో ఒక్కో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.70 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారుల తీరుపై గ్రామాల్లో మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి మద్యం షాపులు, బెల్టు షాపులు నిర్వహణ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వేగావతి నది ; నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

కాజ్‌వే పైనుంచి వరదనీరు

భారీగా స్తంభించిన లారీలు ● రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఇటీవల కురిసిన వర్షాలకు వేగావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వే పైనుంచి వరదనీరు ప్రవహించింది. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు కాజ్‌వే పైనుంచి వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపేశారు. భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మండలాల మీదుగా మళ్లించారు. ఈ విషయం తెలియని లారీ డ్రైవర్లు పారాది వైపు రావడంతో రోడ్డుకు ఇరువైపులా లారీలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించ డంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం మధ్యాహ్నానికి వేగావతి నది ఉధృతి తగ్గడంతో పారాది కాజ్‌వే పైనుంచి వాహనాల రాకపోకలకు ఆర్అండ్‌బి అధికారులు, పోలీసులు అనుమతి ఇచ్చారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో వాహనాలు రాకపోకలు సాగించాయి. సిఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యాన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మడ్డువలసకు పెరుగుతున్న వరదనీరు

వంగర : మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముఖి, వేగావతి నదుల నుండి వరద నీరు బుధవారం ఉదయం నుంచి క్రమేపి సాయంత్రానికి భారీగా పెరిగింది. ఉదయం 5 వేల క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లో రాగా, సాయంత్రానికి 7000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ తెలిపారు. ప్రాజెక్టు లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా ప్రస్తుతం 64.32 మీటర్లకు చేరిందని తెలిపారు. రెండు ప్రధాన గేట్ల ద్వారా 7వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నట్లు తెలిపారు.



రెండు గేట్ల ద్వారా దిగువకు విడిచిపెట్టిన నీరు

కలెక్టర్‌ను కలిసిన సమాచారశాఖ ఎడి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎడి గోవిందరాజులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ సహాయ సంచాలకులుగా నియమితులైన పి.గోవిందరాజులు బుధవారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు

- కంట్రోల్ రూమ్ (8331056279) ఏర్పాటు చేశాం
- ఇప్పటికే 30వేల మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఎరువులకు కొరత లేదని, ప్రస్తుత పంటలకు అవసరమైనంత ఎరువును ఇప్పటికే సరఫరా చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ఎరువుల సరఫరా, ప్రస్తుత నిల్వలు, భవిషత్ అవసరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా అవసరాలకు అనుగుణంగా ఇప్పటికే సుమారు 30వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. జిల్లాలో గత ఏడాది ఈ సమయానికి సుమారు 89,800 హెక్టార్లలో సాగు జరగగా, ఈ ఏడాది ఇప్పటికి 1,02,797 హెక్టర్లమేర సాగు జరిగిందని వివరించారు. సాగు విస్తీర్ణం బట్టి ఈ నెలాఖరుకు సుమారు 37,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. అయితే కావాల్సిన దానిలో ఇప్పటికే 30వేల టన్నులను సరఫరా చేశామని, ప్రస్తుతం 748 టన్నుల యూరియా సిద్ధంగా ఉందని చెప్పారు. రానున్న నాలుగు రోజుల్లో 2వేల టన్నులు, ఆ తరువాత అవసరమైన మిగిలిన యూరియా జిల్లాకు చేరుతుందని వివరించారు. దీంతో ఎరువులకు ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఎరువుల సరఫరాలో రైతులకు సహాయం చేయడానికి, సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకోవడానికి ఇప్పటికే 8331056279 నంబరుతో జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మండల స్థాయిలో తాహసీల్దార్, ఎస్ఐ, సిఎస్‌డిటిలతో ప్రత్యేక బృందాలను నియమించి, ఎరువుల షాపులను తనిఖీ చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 411 తనాఖీలను నిర్వహించి, 8 మంది విక్రయదారులపై 6ఏ కేసులను నమోదు చేశామని, ఒకరిపై ఎఫ్ఐఆర్ పెట్టామని, నలుగురి లైసెన్సులను రద్దు చేశామని, సుమారు రూ.34 లక్షల విలువైన 191 టన్నుల యూరియాను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి వ్యవసాయశాఖ జెడి విటి రామారావు పాల్గొన్నారు.

17న ఆటో, టాటా మేజిక్‌ల బంద్

కార్మిక సంఘాలు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉచిత బస్సు (స్త్రీశక్తి) పథకం కారణంగా రోడ్డున పడిన ఆటో, టాటా మేజిక్ వాహనాల డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న జిల్లా బంద్‌ను చేపడుతున్నట్లు కార్మిక సంఘాలు నాయకులు ప్రకటించారు. బుధవారం స్థానిక అమర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా బంద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా నాయకులు ఎ.జగన్మోహనరావు, ఎఐటియు సి రాష్ట్ర నాయకులు జి.వామనమూర్తి, జిల్లా అధ్యక్షులు రంగరాజు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా, రెడ్డి నారాయణరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళకు ఉచిత బస్సు పథకం ఆటో, టాటా మేజిక్ వాహనాలు డ్రైవర్లకు ఉరితాడుగా మారిందన్నారు. ఉపాధి లేక డిగ్రీలు చదివి ఆటో, టాటా మేజిక్ వాహనాలు నడుపుకుంటూ వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఈ పథకంతో వీరికి ఉపాధి లేక అల్లాడిపోతున్నారని అన్నారు. మరోవైపు వాహన మిత్ర కింద డబ్బులు ఇస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు 5 శాతం వడ్డీతో 5 లక్షల రుణాలు ఇస్తామని, జీఓనెం 21ను రద్దు చేస్తామని, మోటారు కార్మికులు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని ఆటో, టాటా మేజిక్ వాహన కార్మికులను కోరారు. సమావేశంలో నాయకులు జి.కన్నారావు, బి.తిరుపతి, జి.అప్పారావు, ఎం.రమణ, టి.ఈశ్వరరావు, ఎన్.అప్పలరాజు, జి.నారాయణరావు, బి.సన్యాసిరాజు, కె.రమణ, సిహెచ్ ధర్మారావు, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వర్క్ ఫ్రమ్ హోమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యూయేషన్, ఉన్నత విద్య చేసి ఉంటారో వారికి సంబంధించిన పూర్తి వివరాలు రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ సిబ్బంది ద్వారా నమోదు చేసి కొత్తగా వర్క్ ఫ్రమ్ హోమ్ ను ప్రారంభించిందని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ప్రస్తుతం ఎవరికి వారే వ్యక్తిగతంగా కూడా ఆన్లైన్ ద్వారా తమ వివరాలను వర్క్ ఫ్రం హోం విధానానికి లింక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. https://gsws-nbm.ap.gov.in/BM/Koushalam వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలను స్వయంగా అందజేస్తూ కౌశలం పోర్టల్‌లో నిక్షిప్తం చేసుకోవచ్చునితెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సమస్యలపై 9న నిరసన

రైతులను నయవంచన చేసిన కూటమి ప్రభుత్వం : వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ నెలకొన్న రైతు సమస్యలపై రెవెన్యూ డివిజన్ల స్థాయిలో ఈనెల 9న రైతు నిరసన కార్యక్రమాన్ని పెద్ద స్థాయిలో నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) తెలిపారు. బుధవారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగం అనేక సాగు సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని, అయినా ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు కూడా లేదని అన్నారు. పైగా రైతుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా ఈ ప్రాంతానికి చెందిన వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారని తప్పుబట్టారు. నాట్లు వేసిన రైతాంగానికి కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. జిల్లాలో యూరియా, డిఎపి వంటి ఎరువులు కొరత అధికంగా ఉందని పత్రికల్లో కథనాలు వస్తుంటే, వాటిని ఖండిస్తూ సమాచార శాఖ ద్వారా ఈ ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు ఇస్తూ రైతులను దగా చేస్తుందని ధ్వజమెత్తారు. ఎరువుల కొరత, అన్నదాత సుఖీభవ లోపాలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, నిర్వీర్యం అవుతున్న రైతు భరోసా కేంద్రాలు వంటి అనేక రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు 9న వైసిపి ఆధ్వర్యంలో రైతు నిరసన కార్యక్రమాన్ని తలపెట్టామని తెలిపారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లు విజయనగరం, చీపురుపల్లి, ఎస్.కోటతో పాటు బొబ్బిలి పరిధిలోని గజపతినగరం నియోజకవర్గం స్థాయిలో పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. విలేకర్ల సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్య నారాయణ రాజు, గంట్యాడ జెడ్‌పిటిసి వి.నరసింహమూర్తి , తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

పారదర్శకంగానే డిఎస్‌సి అభ్యర్థుల ఎంపిక

పది రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడి : ఆర్‌జెడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సిలో అర్హత సాధించిన ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగు తుందని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ తెలిపారు. బుధవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించేందుకు ఆయన వచ్చారు. అనంతరం డిఇఒ మాణిక్యంనాయుడుతో కలసి మీడియాతో మాట్లాడారు. డిఎస్‌సి అభ్యర్థుల ఎంపిక పట్ల అపోహలు అవసరం లేదన్నారు. అభ్యర్థులకు ఎటువంటి అభ్యంతరాలున్నా డిఇఒకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. పది రోజుల్లో పూర్తి డేటా ప్రచురణ జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరైన ప్రతి అభ్యర్థి మార్కుల వివరాలతో ఫైనల్ లిస్ట్ బోర్డు పెట్టి ఎంతమంది పరీక్షకు హాజరయ్యారు, ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయో, ఎంపికైన వారి వివరాలను నోటీసుబోర్డులో ప్రదర్శిస్తారని తెలిపారు. అన్ని విషయాలు వెబ్ సైట్‌లో ఉంటాయని తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

పైడితల్లమ్మ ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో అమ్మవారి దేవస్థానానికి చెందిన ప్రచార రథాన్ని బుధవారం అమ్మవారి కోవెల వద్ద ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. పండుగ జరగబోయే కార్యక్రమాలను తేదీల వారీగా ఉత్తరాంధ్రలో ప్రతి మండలంలో తెలియజేస్తూ ఈ రథం తిరగనుంది. పండగ ఈనెల 12 తేదీన ఉదయం 9:30 గంటలకు పందిరి రాటతో ప్రారంభం కానుంది. అక్టోబర్ 2న అర్ధ మండల దీక్ష (21 రోజులు) ప్రారంభమవుతుంది. 6న తొలేళ్ల ఉత్సవం, 7న సిరిమాను ఉత్సవం, 14న తెప్పోత్సవం, 21న ఉయ్యాల కంబాల, 22 న పండుగ ముగింపు కార్యక్రమం చండీ హోమం, పూర్ణాహుతి (వనం గుడి వద్ద) తో పూర్తికానుంది. కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్ శిరీష పూజారివెంకటరమణ, ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విద్యారంగ సమస్యలపై 6న చలో విజయవాడ

ప్రజాశకి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో బుధవారం చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా విద్యారంగ సమస్యలు పరిష్కరించలేదన్నారు. జిల్లాలో 5 ఏళ్ల క్రితం ఏర్పడిన విజయనగరం, రాజాం, గజపతినగరం డిగ్రీ కళాశాలలు దిక్కు మొక్కు లేకుండా పోయాయని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్ కు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న 6500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి డిగ్రీ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. డిమాండ్ల సాధనకు జరుగుతున్న చలో విజయవాడను విద్యార్థులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, వి.చినబాబు, నాయకులు రమణ పాల్గొన్నారు.



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా గోపాల్, విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శులుగా వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మి ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం విజయవాడలో నిర్వహించిన ఇంటర్వ్యూలో ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనగా, విజయనగరం కంటోన్మెంట్ హై స్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.గోపాల్, జొన్నవలస హై స్కూల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయిని ఎస్.విజయలక్ష్మి ఎంపికయ్యారు. గతంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా ఒక్కరే ఉండగా ఈ ఏడాది నుంచి ప్రతి జిల్లాకు ఇద్దరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారిని డిఇఒ మాణిక్యంనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటనాయుడు, జి.లక్ష్మణరావు అభినందించారు.


గోపాల్


విజయలక్ష్మి

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పోలీసు అధికారులు తమ పరిధిలోని కళాశాలల్లో ర్యాగింగు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్‌పి వకుల్‌జిందల్ ఆదేశించారు. ర్యాగింగు వలన కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించి, అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల శృతిమించి ప్రవర్తిస్తే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలన్నారు. ర్యాగింగుకు పాల్పడిన విద్యార్థులపై చట్టరీత్యా చర్యలు చేపట్టడంతోపాటు అర్ధంతరంగా వారి చదువు, కెరీర్ కూడా నాశనం అవుతుందన్న విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. కళాశాలల్లో చేరిన విద్యార్థులను ర్యాగింగు పేరుతో ఇతర విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా, ప్రాథమిక స్థాయిలోనే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ర్యాగింగ్‌ను నియంత్రించేందుకు కళాశాలల యాజమాన్యాలు యుజిసి మార్గదర్శకాలను పాటించాలన్నారు. ర్యాగింగుకు పాల్పడినా, ఎవరైనా ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, ఈ తరహా నేరాలకు పాల్పడితే 2ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు, రూ.10వేలు వరకు జరిమానా విధిస్తారని తెలిపారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట


నిర్వాసితుల సమస్యలను అధికారులకు వివరిస్తున్న జగన్

జిందాల్ నిర్వా సితులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లాజగన్ డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉప కలెక్టర్ మురళి ఆధ్వర్యాన బుధవారం మూల బొడ్డవర సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యాన నిర్వాసితులు నిరసన తెలిపారు. జిందాల్ యాజమాన్యం కంపెనీ కడతామని, ఉద్యోగాలు ఇస్తామని చెప్పి భూమి సేకరించి మోసం చేసిందని, నిర్వాసితులకు న్యాయం చేయాలని జగన్ కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌డిసి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ జిందాల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలో కొత్తబగ్గాం గ్రామంలో అన్నయ్యను తమ్ముడు పీక కోసి హత్య చేసిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బుధవారం సంఘటనా స్థలాన్ని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి పరిశీలించారు. సిఐ జివివి రమణతో మాట్లాడి, ఘటనపై ఆరాతీశారు. గ్రామస్తులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐ కిరణ్ కుమార్ నాయుడు, విఆర్‌ఒ రాజేష్, మహిళా పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 33, 48, 49 సచివాలయాలను నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు బుధవారం తనిఖీ చేశారు. పన్ను పరిధిలోకి రాని ఆస్తి వివరాలు నమోదు, అధనపు నిర్మాణాలపై పన్ను విధింపు వంటి ప్రక్రియలు ఏ విధంగా చేపడుతున్నారో తెలుసుకున్నారు. 48,49 సచివాలయాల పరిధిలో దీర్ఘకాలంగా నీటిఛార్జి బకాయిలు ఉన్న కుళాయి కనెక్షన్లను తొలగించారు.

బాదం మిల్క్ కేంద్రాల తనిఖీ

నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బాదం మిల్క్ కేంద్రాలపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గుడ్స్ షెడ్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న బాదం మిల్క్ కేంద్రాన్ని తనిఖీ చేసి అపరాధ రుసుము విధించారు. నిబంధనలు పాటించకుండా బాదం మిల్క్,ఐస్ క్రీమ్ లను పెద్ద ఎత్తున తయారుచేసి నగర వ్యాప్తంగా సుమారు 50 వరకు ఉన్న బాదం మిల్క్, ఐస్‌క్రీమ్ బడ్డీలకు సరఫరా జరుగుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.


అవార్డు అందుకొంటున్న ప్రిన్సిపల్ పురుషోత్తం

కోమటిపల్లి ఎంజెపి పాఠశాలకు అవార్డు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రాష్ట్రస్థాయిలో మండలంలోని కోమటిపల్లి మహాత్మా జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాల సూపర్ స్కూల్‌గా ఎంపికైంది. ఈ మేరకు విజయవాడలో ఎంజెపి రాష్ట్ర కార్యదర్శి ఎం.మాధవిలత నుంచి పాఠశాల ప్రిన్సిపల్ జి.పురుషోత్తం అవార్డును అందుకున్నారు. ఈ ఘనత పాఠశాల సహచర ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి వల్లే సాధ్యమైందని ప్రిన్సిపల్ తెలిపారు.


మెగా ఫోన్ బాక్స్‌ను అందజేస్తున్న గణేష్

పాఠశాలకు మెగా ఫోన్ బాక్స్ వితరణ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు సేనాపతి తాతారావు జ్ఞాపకార్థం కుమారుడు సేనాపతి గణేష్ మెగా ఫోన్ బాక్స్‌ను అందజేశారు. పెరుగుతున్న టెక్నాలజీ వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో దీనిని అందజేసినట్లు గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా తాతారావు కుటుంబానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నల్లబిల్లిలో పశు వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని నల్లబిల్లి గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు పశువైద్యాధికారి గాయత్రి తనిఖీలు చేశారు. వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు.


చురుగ్గా పారిశుధ్య పనులు

సోంపురం సచివాలయ పరిధిలో పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సిసి రోడ్లకు ఇరువైపులా కాలువల్లో పూడికతీత చేపట్టారు. వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. ఇళ్ల వద్ద ఉన్న గుంతలను కప్పి వేయించి, పిచ్చి మొక్కలను కూడా తొలగించారు.

గురజాడ సాహిత్యాన్ని కాపాడాలని శాంతిదీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగు సాహితీ వికాసానికి వెలుగుబాటగా నిలిచిన మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని, ఆయన రచనలను రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈమేరకు బుధవారం ఉదయం 7గంటల నుండి 11గంటల వరకూ గురజాడ గృహంలో శాంతిదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ తన రచనల ద్వారా సామాజిక చైతన్యం కలిగించి వ్యవహారిక భాషోద్యమ కారుడిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన గురజాడ నడయాడిన గృహాన్ని ఆధునీకరించాలని, వారి సాహిత్యాన్ని ముందు తరానికి అందించేందుకు డిజిటలైజ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 21 న జరగనున్న గురజాడ 163 వ జయంతి ని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, తుమ్మగంటి రామ్మోహన్ రావు, ఇప్పలవలస గోపి, దవడ కొండబాబు,మీనా, ధవళ సర్వేశ్వర్రావు, నాలుగెస్సుల రాజు, పాండ్రంకి వెంకటరమణ, ఇందిరా, లలితా, ఈశ్వర ప్రసాద్,కాపుగంటి ప్రకాశ్, విజయ్ కుమార్,జక్కు రామకృష్ణ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.


గురజాడ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న భీశెట్టి బాబ్జీ, పౌర వేదిక నాయకులు

సామాజిక చైతన్య కవిత్వమే చిరకాలం నిలుస్తుంది

'మంజూరు' కవితా సంకలనం ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సాహిత్యం, సామాజిక చైతన్యం, సంఘ శ్రేయస్సును కోరుతూ చేస్తున్న కవిత్వమే చిరకాలం నిలుస్తుందని పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ జివి ఎస్.జయపాలరావు అధ్యక్షతన 'ముంజూరు' కవితా సంకలనం ఆవిష్కరణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రేఖ చేతుల మీదుగా జరిగింది. సంకలన కర్త దుప్పల రవికుమార్ కాగా, డాక్టర్ ఎం.రమాదేవి సమీక్ష చేశారు. ముఖ్యఅతిథిగా సాహితీ స్రవంతి అధ్యక్షులు చీకటి దివాకర్ హాజరయ్యారు. ఆప్త వాక్యం, ప్రముఖ కవులు రాజా చంద్రశేఖర్, పాయిల మురళీకృష్ణ, ఎన్‌కె బాబు, వి.శ్రీనివాసరావు పలికారు. సమాజంలో ఉన్న అనేక అంశాలపై స్పందించి, సాహిత్యం, సామాజిక చైతన్యం, సంఘ శ్రేయస్సును కోరుతూ చేస్తున్న కవిత్వమే చిరకాలం నిలుస్తుందని చెప్పారు. పుస్తకావిష్కర్త, ప్రిన్సిపాల్ రేఖ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీయడం కోసమే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నగరంలో పేరెన్నికన్న ప్రముఖులందరూ విచ్చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చదవడం రాయడమనే అలవాటును పిల్లలు పెంచుకోవాలని సూచించారు. చీకటి దివాకర్ గారు మాట్లాడుతూ, మానవ సమాజం అభ్యున్నతికి కారణం ప్రశ్న వేయడమేనని, ప్రతి విషయాన్ని తార్కికంగా ఆలోచించి ప్రశ్నలు వేస్తుంటేనే సమాధానాలు దొరుకుతాయని చెప్పారు. డాక్టర్ ఎం.రమా గీతా దేవి చక్కని సమీక్ష చేశారు. కళింగాంధ్రలో ఉన్న కవులందరి గొప్పతనాన్ని విశిష్టతను, ఉత్తరాంధ్ర ఉద్యమంలో సాహిత్యం పాత్ర గురించి వివరంగా వివరించారు. ఎన్‌కె బాబు మాట్లాడుతూ, పుస్తకాలు పబ్లిష్ చేయడం వ్యయప్రయాసలతో కూడుకున్నప్పటికీ, నేటి సమాజ స్థితిగతులను, రేపటి తరానికి అందించడమే పబ్లిషర్‌గా తమ బాధ్యతని అన్నారు. రాజా చంద్రశేఖర్ మాట్లాడుతూ ముంజూరు పుస్తకంలో ఉన్నటువంటి, కవిత వాక్యాల్ని, సృజనాత్మక విషయాలను, కవిత్వం రాయడంలో మెలకువులను పిల్లలకు వివరించారు. పాయల మురళీకృష్ణ మాట్లాడుతూ, చిన్నపిల్లలు రాస్తున్న కథలు, కొన్నింటిని చెబుతూ రాయడం అన్నది నిరంతర ప్రక్రియ అని, ప్రయత్నం చేస్తే సాధ్యం కానిది లేదని అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ పి.రూపవాణి, డాక్టర్ బి.సుభ, తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.


మంజూరు కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

డ్రోన్లతో ఎరువుల పిచికారీ : ఎడి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో రైతు పల్లె భాస్కరరావు పొలంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు, ఎఒ టి.సంగీత సమక్షంలో బుధవారం నానో యూరియాను డ్రోన్ ద్వారా వరి పంటలో పిచికారి చేయించారు. ఎడి నాగభూషణరావు మాట్లాడుతూ మాట్లాడుతూ నానో యూరియాను పిచికారి చేయడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు మొక్కలకు పోషకం శీఘ్రంగా అందుతాయని తెలిపారు. ఎఒ సంగీత మాట్లాడుతూ నానో యూరియాను డ్రోన్ ద్వారా ఎకరం పొలంను మూడు నుండి ఐదు నిమిషాల్లో పిచికారీ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పి.భాస్కరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పలుపత్ర కషాయంతో మేలు

సంతకవిటి : మండలం గోవిందపురం పంచాయతీ నారాయణరాజపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జ్ పాత్రుని వెంకటరమణ, సిఆర్‌పి బేత ఝాన్సీ ఆధ్వర్యంలో 400లీటర్ల పలుపత్ర కషాయం ప్రయోగాత్మకంగా రైతులతో కలిసి తయారు జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, అపరాలు, పండ్ల జాతి, కూరగాయలు, ఆకుకూరలు ఇలా ఏ పంటకైనా మొక్కలకు కావలసిన సూక్ష్మ పోషకాలు స్థూల పోషకాలు చీడపీడల నివారించడానికి ఈ కషాయం ఉపయోగపడుతోందన్నారు. స్థానికంగా దొరికే వనరులు వేప, జిల్లేడు, సీతాఫలం, బొప్పాయి, జామ, ఆముదం, ఎర్నమ్మ, మునగ ఆకులతో ఈ కషాయాలను తయారు చేయవచ్చునన్నారు. రైతులు ఈ విధంగా చేయడం వల్ల పెట్టుబడి తగ్గి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చునన్నారు.

పంటల సస్య రక్షణపై రైతులకు అవగాహన

గజపతినగరం రూరల్ : గజపతినగరం మండలంలో సీతారాంపురం, కాలం రాజుపేట గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యాన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మల్టీకే (13-0-45) ఎరువులు ఉపయోగించు కోవాలని కోరారు. మల్టీకే ఎరువులో 13శాతం యూరియా, ఫాటోష్ 45శాతం ఉండడంతో మొక్కకు కావాల్సిన బిగువు తెగులు, పురుగుల నుంచి రక్షణ ఉంటుందన్నారు. పొట్ట దశలో పిచి కారీ చేయటంతో వరి పంటకు కావలసిన ఎరువులు సంపూర్ణంగా అందడంతో అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అనంతరం రి పంట పొలాలను పరిశీలించి పంట సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులుగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామాల్లో రైతులతో పాటు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


డెంకాడ: డ్రోన్‌తో ఎరువుల పిచికారీని పరిశీలిస్తున్న అధికారులు


గజపతినగరం : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ కిరణ్‌కుమార్

నానో యూరియాపై అవగాహన

వేపాడ : మండలంలోని ముకుందపురం, ఓబులయ్యపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది నానో యూరియాపై అవగాహన కల్పించారు. డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ గురించి తెలియజేశారు. ఆకుముడత, పొడ తెగులు వచ్చే అవకాశం ఉందని, యూరియా వాడకం తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హరిత ఎఫ్‌పిఒ సిఇఒ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ నవతరోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యువతలో సేవ భావాన్ని పెంచాలని విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ ఉత్సవ నిర్వహణ కమిటీ డైరెక్టర్ రోహిత్ అన్నారు. బుధ వారం నవతరోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా రోహిత్ సంజయ్ మాట్లాడుతూ యువతలో సేవా భావాన్ని కలిగించేందుకు, క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఏటా సెప్టెంబర్‌లో రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో నవతరోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ గ్రంధి కృష్ణ తేజ మాట్లాడుతూ నవతరోత్సవాలలో భాగంగా నెల రోజులపాటు సంగీతం, సాహిత్యం, క్రీడా రంగాలకు సంబంధించి 15 కార్యక్రమాలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల మొదటి రోజు నిర్వహించిన డాన్స్ పోటీల్లో 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరికి ఉత్సవాల ముగింపు రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, చైర్మన్ చెన్నా ప్రదీప్, ప్రతినిధులు ఆర్.శంకర్ రెడ్డి, పి.జయకృష్ణ, కాపుగంటి శ్రీనివాస్, ప్రకాష్, టి.ఎల్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవిని తిరస్కరించిన వనజాక్షి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షికి టిడిపి ప్రభుత్వం బుధవారం ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వనజాక్షి ఈ పదవిని తిరస్కరించారు. ఆమె భర్త రవిశేఖర్ టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్ పదవిని తిరస్కరించిన ఆమె తన భర్త రవిశేఖర్ లేదా సోదరుడు కడగల ఆనంద్‌కు పదవి ఇవ్వాలని ఆమె పార్టీని కోరినట్లు తెలిపారు

శతశాతం అక్షరాస్యతతో అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శతశాతం అక్షరాస్యతతో అభివృద్ధి సాధ్యమవుతుందని డైట్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు అన్నారు. బుధవారం స్థానిక డైట్‌లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం వారోత్సవాల్లో భాగంగా ఛాత్రోపాధ్యాయులకు 'అందరికీ విద్య నూరు శాతం అక్షరాస్యత' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలు కె.అశ్విత ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ మీడియం, కె.స్వాతి, బి.నీలిమలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి వేణుగోపాల్, స్టాఫ్ సెక్రెటరీ వాక చిన్నంనాయుడు, సీనియర్ లెక్చరర్ ముగడ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, సూపరింటెండెంట్ కమలకుమారి, సిబ్బంది సూరిబాబు, శ్రీనివాసరావు, అప్పారావు, ఎస్‌ఈ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో కృత్రిమ మేధస్సుపై కార్యశాల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన భవిష్యత్ టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యత వహించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 'హౌ టు బి ఎఐ రెడీ' అనే అంశంపై బుధవారం ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకి చెందిన 'ఓపెన్ టెక్స్ట్' , సీనియర్ క్వాలిటీ అస్యూరెన్స్ ఇంజినీర్ వి.ఎన్. చైతన్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పరిశ్రమలో ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ కి ఉన్న డిమాండ్, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యార్థులు ఎలా సిద్ధపడాలి" అనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వీరామమూర్తి, సిఎస్ఇ విభాగాధిపతి జి.వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్ పుట్టినరోజున పలు సామాజిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 5న పలు సామాజిక కార్యక్రమాలు చేపడతామని వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసునాయుడు, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, కనక మహాలక్ష్మి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు, వృద్ధాశ్రమంల, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తామన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు దన్నాన జనార్దన్ రావు, బెల్లాన త్రినాథ రావు, పతివాడ రాజారావు, గవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - గరివిడి



డ్రగ్స్ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ, పోలీసు అధికారులు

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాలభాస్కరరావు అధ్యక్షతన ర్యాగింగ్, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఆర్‌డిఒ బి.అశయ్య, గౌరవ అతిథిలుగా డిఎస్‌పి ఎస్. రాఘవులు, తహశీల్దార్ సిహెచ్. బంగార్రాజు, సిఐ జి.శంకర్రావు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ లోకేశ్వరరావు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని, ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని కోరారు. ర్యాగింగ్ కేసులో పొరపాటున ఉంటే వారితో పాటు కుటుంబం కూడా ఎంతో ఇబ్బందులకు గురి అవుతుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాల వేటలో పడి అసాంఘిక కార్యక్రమాలకు లోనై జైలు జీవితానికి గురి కావద్దని కోరారు. నేటి యువత దేశానికి శక్తి అని, గంజాయి,కొకైన్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. డ్రగ్స్ కేసులో ఉంటే 6 నెలల వరకు బెయిల్ ఉండదని, నేరం రుజువైతే 20 సంవత్సరాలు వరకు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నివారణపై పోస్టరు ఆవిష్కరించి డ్రగ్స్ జోలికి పోమని ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు సంజీవని

ప్రజాశక్తి - చీపురుపల్లి

అనారోగ్యంతో బాధపడేవారికి సిఎం సహాయ నిధి సంజీవని వంటిదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు అన్నారు. నియోజకవర్గంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వెళ్ళలేని పరిస్థితిలో ఉన్న ఎంతోమంది బాధితుల జీవితాల్లో ఆర్థిక భరోసాను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేపడుతున్నామని రామ్ మల్లిక నాయుడు అన్నారు. 11 మంది బాధితులకు సుమారు ఆరు లక్షల రూపాయల చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్, రేగాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా అన్నప్రసాద వితరణ

చీపురుపల్లి లావేరు రోడ్‌లో గణపతి ఉత్సవాలలో భాగంగా బుధవారం భారీ అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, గద్దె ఆమోగ్ చౌదరి, రౌతు కామనాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు యువసేన కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గరివిడి

ఈ నెల 7,8 తేదీల్లో రాజాంలో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు అధ్యక్షతన గోడ పత్రికలు బుధవారం విడుదల చేశారు. పెన్షనర్ సంఘం ప్రధాన కార్యదర్శి ఒఎస్ఎన్ మూర్తి, అధ్యక్షులు సలీం, కార్యవర్గ సభ్యులు గంట్యాడ అప్పలరాజు, బి జగదీష్, ఉత్తరావల్లి ప్రకాష్, కెవి రెడ్డి పాల్గొన్నారు.

కొత్తవలస : మహాసభ పోస్టర్‌ను సిఐటియు నాయకులు గాడి అప్పారావు ఆవిష్కరించారు.

గజపతినగరం : పురిటిపెంట పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి ఆధ్వర్యాన మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వాహనం ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ బి. గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆర్ఒబి వద్ద గుర్ల మండలం గరిడి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడైన దాసరి సురేష్ (28) విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విజయనగరం నుంచి గరివిడి వైపు వెళ్తున్న బోలెరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ గణేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని వికలాంగుడు దుర్మరణం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని కొండతామరపల్లి జంక్షన్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వికలాంగుడు చప్ప గౌరినాయుడు (32) అక్కడికక్కడే మృతి చెందాడు. గింజేరుకు చెందిన గౌరినాయుడు కొండతామరాపల్లి జంక్షన్‌లో నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

పేకాడుతున్న ఎనిమింది మంది అరెస్టు

ప్రజాశక్తి కంటోన్మెంట్

నగరంలోని వైయస్సార్ నగర్ ప్రాంతంలో పేకాట శిబిరంపై బుధవారం దాడి చేసినట్లు విజయనగరం టూ టౌన్ సిఐ డి శ్రీనివాసరావు తెలిపారు. పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.17595 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వమిత్వ సర్వే వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని తహశీల్దార్ ఎం.శ్రీను అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక సాధికారత, స్వీయ సాధికారత కోసం స్వమిత్వ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఆ దిశగా సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, డిప్యూటీ ఎంపిడిఒ భాస్కరరావు, సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి-గంట్యాడ

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చునని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. రామవరం పంచాయతీ పరిధిలోని కరకవలస అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లులకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగాకు, తోటకూర, బొప్పాయి వంటి పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చునని చెప్పారు. గర్భం దాల్చిన తర్వాత మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త హేమ, హెల్పర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డైట్ అధ్యాపక బృందం తనిఖీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డైట్ కాలేజ్ అధ్యాపక బృందం పలు ప్రభుత్వ పాఠశాలలను పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. డైట్ అధ్యాపకులు కోటపాటి రంజిత, సూర్యకళ, సౌమ్య ఇందిర, మురళి, లక్ష్మణరావు బృందంగా ఏర్పడి బుధవారం సతివాడ కల్లాలు ఎంపిపి పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. గరివిడి మండలంలోని కోనూరు జడ్‌పి హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివిజికె మూర్తి పాఠశాల ప్రగతికి చాలా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. పిల్లల ప్రగతిని, ఎండిఎంను పరిశీలించారు.

ఎంపిడిఒ కార్యాలయ సందర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహనాధికారి బివి సత్యనారాయణ బుధవారం సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామకృష్ణ రాజు, మండల పరిషత్ ఎఒ పి.సుదర్శనం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం జరగకపోతే ఆత్మహత్యకు సిద్ధం

ప్రజాశక్తి - గరివిడి

వెదుళ్లవలస గ్రామంలో ఎపిఈపిడిసిఎల్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు నియమితులైన సబ్ స్టేషన్ నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లలో ఇద్దరిని తొలగించి తమకు తెలియకుండా కొత్తవారిని నియామకం చేయడాన్ని ఆ నలుగురు వ్యతిరేకించి బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా ఉద్యోగం ఉందనే భరోసాతో అప్పులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ఇప్పుడు అర్థంతరంగా తొలగిస్తే ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప తమకు వేరే దారి లేదన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కోటలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే బేబినాయన జాబ్‌మేళాను ప్రారంభించారు. జాబ్‌మేళాకు 12 కంపెనీలు పాల్గొన్నాయి. నియోజకవర్గం నుంచి సుమారు 500 మంది వరకు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 120 మంది ఎంపికయ్యారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించినట్లు బేబినాయన చెప్పారు.